సాక్షి
తిరుపతి
ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



శేష వాహనంపై కరకంఠేశ్వరుడు

నగరి : పట్టణంలోని కామాక్షి సమేత కరకంఠే శ్వర ఆలయంలో పంగుణోత్తర కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారిని శేష వాహనంపై ఊరేగించారు.



పెద్ద కొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం పెద్దకొట్టాయి ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు.



శనేశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కలశ పూజలు, తర్వాత స్వామి వారికి తైలాభిషేకం, అభిషేకాలు నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం(సా)	సహర్ సోమవారం(ఉ)
తిరుపతి	6.28	4.48
చిత్తూరు	6.30	4.47
పుంగనూరు	6.31	4.51

న్యూస్‌రీల్

'పది' విద్యార్థులకు ఆర్టీసీలో ప్రయాణం ఉచితం

తిరుపతి అర్బన్: పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు హాల్‌టిక్కెట్ ఉంటే పరీక్ష సెంటర్ వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఉచితమని డీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 3 నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

కారుణ్య నియామకాలకు కసరత్తు

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో కారుణ్య నియామకాలను భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కారుణ్య నియామకాల కోసం గతంలో పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ప్రధానంగా 9 మంది ఆర్టీసీ కానిస్టేబుల్స్‌కు, 33 మంది ఆర్టీసీ డ్రైవర్లకు, 43 మంది శ్రామిక్స్ (గ్యారేజ్ కార్మికులుగా) దరఖాస్తు చేసుకున్నారు. ఆ మేరకు కసరత్తు చేస్తున్నారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో సోమవారం నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహించాలని డీఈఓ శేఖర్ ఆదేశించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఒంటిపూట బడులపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే పాఠశాల నిర్వహించాలని స్పష్టం చేశారు.

అత్యంత ప్రాచీనమైన గ్రామదేవత తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉంది. ఆలయ పునః ర్మాణంలో భాగంగా చేపట్టిన తవ్వకాల్లో బయటపడ్డ పురాతన కట్టడాలే ఇందుకు సాక్ష్యం అని చరిత్ర కారులు చెబుతున్నారు. గర్భాలయ నిర్మాణంలో భాగంగా 12 అడుగుల లోతులో బయటపడిన రాతి కట్టడాలు పల్లవుల ఆఖరి కాలం నాటివని ఆర్కియాలజీ అధికారులు అభిప్రాయపడ్డారు. జాతరకు సిద్ధమవుతున్న తాతాయ్యగుంట గంగమ్మ ఆలయ విశేషాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



రూపుదిద్దుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మ ఆలయం



గంగమ్మా.. వెయ్యి వందనాలమ్మా!

- తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర
- భక్తుల కొంగుబంగారంగా వర్ధిల్లుతున్న శ్రీవారి చెల్లెలు
- ప్రాచీన వైభవ వ్యాప్తికి ఎమ్మెల్యే భూమన విశేష కృషి
- శరవేగంగా ఆలయ పునఃనిర్మాణ పనులు
- జాతర లోపు పూర్తి చేసేదిశగా అడుగులు



రాతి స్తంభాలను పరిశీలిస్తున్న పురావస్తుశాఖ అధికారులు (ఫైల్)



రూపుదిద్దుకుంటున్న ఆలయం

సాక్షి, తిరుపతి: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మని సాక్షాత్తు శ్రీవారి అపరభక్తాగ్రేసరుడు అనంతాచార్యులచేత స్వయంగా ప్రతిష్ఠించారు. అప్పటి కుగ్రామమైన తిరుపతి ప్రజల పరిరక్షణకు గ్రామదేవతగా భక్తులచేత పూజలందుకుంటూ ఏడు రోజుల పాటు జానపద వేషధారణలతో ప్రతిష్టాత్మకంగా జాతర సంబరాలు కొనసాగించారు. దేశంలోనే ప్రథమ గ్రామదేవత ఉత్సవాన్ని జరుపుకున్న ఆలయం కూడా తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తల్లి. వైష్ణవ భక్తుడైన తాతాచార్యులకు కైంకర్యార్థం లభించిన చెరువుకు తాతయ్యగుంట అని పేరు ఉందని, ఇదే చెరువు గట్టు మీద వెలియడంతో అమ్మవారికి తిరుపతి గంగమ్మ అని పిలిచేవారు. కాలక్రమేణా శ్రీతాతయ్యగుంట గంగమ్మ అని ప్రాశస్తి చెందింది. నాటి నుంచే పూజలందుకుంటూ గంగమ్మ భక్తుల కొంగుబంగారంగా అలరారుతోంది. తాళ్లపాక అన్నమయ్య తిరుపతి గంగమ్మను దర్శించి మొక్కులు చెల్లించడంతో తాళ్లపాక గంగమ్మ అని పేరు కూడా వచ్చిందని చారిత్రక ఆధారలు చెబుతున్నాయి.

నాటి నుంచే టీటీడీ పర్యవేక్షణలో గంగమ్మ ఆలయం

గంగమ్మ ఆలయ పర్యవేక్షణ ఎప్పటి నుంచో టీటీడీ పరిధిలో ఉండేది. బ్రిటీష్ వారు 1843లో టీటీడీ ఆలయ పర్యవేక్షణను హథీరాంజీ బావాజీకి అప్పగించారు. అప్పటి నుంచి తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు శ్రీగోవిందరాజస్వామి ఆలయం, శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం, కపిలతీర్థం ఆలయం ఇలా 26 ఆలయాల పర్యవేక్షణను ఆయన చూసేవారు. ఇందులో శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం కూడా ఉండేదని చారిత్ర ఆధారాలు ఉన్నాయి. 1933లో టీటీడీ పాలక మండలి ఏర్పాటైంది. దాంతో బ్రిటీష్ వారు తిరుమల శ్రీవారి ఆలయ పర్యవేక్షణను పాలక మండలికి అప్పగించారు.

గంగమ్మ దర్శనం తర్వాతే శ్రీవారి దర్శనం

శ్రీవేంకటేశ్వరస్వామి వారి స్వయాన చెల్లెలు అని అనంతాచార్యులు శ్రీతాతయ్యగుంట గంగమ్మను ప్రతిష్ఠించారు. తిరుమల స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులు ముందుగా శ్రీవారి చెల్లెలైన గంగమ్మను దర్శించుకునే వారు. ఆ తర్వాతే తిరుమల శ్రీవారిని దర్శించుకునే ఆచారం మొదలైంది. సుమారు 500 సంవత్సరాల పూర్వం నుంచే ఈ ప్రాచీన సంప్రదాయ ఆచారం ప్రబలమైంది. అయితే కాలక్రమేణా తిరుమలకు వెళ్లే దారులు పెరగడంతో ఈ సంప్రదాయం కనుమరుగైంది.

తోబుట్టువుకు శ్రీవారి సారె

గంగమ్మ తల్లి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి స్వయాన తోబుట్టువు కావడంతో శ్రీవారు సారె పంపేవారు. ఈ సంప్రదాయం 400 ఏళ్ల క్రితమే ఉండేది. భారతీయ సనాతన సంప్రదాయం ప్రకారం శ్రీతాతయ్యగుంట గంగమ్మకు ప్రతి ఏటా జాతర నెలలో శ్రీవారి ఆలయం నుంచి సారె అందుతోంది.

తిరుపతి గంగమ్మను దర్శించుకున్న తొలి సీఎం వైఎస్ జగన్

గంగమ్మ దర్శనం తర్వాతే శ్రీవారి దర్శన పునః ప్రారంభానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారు. గత ఏడాది శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందు ఆయన తిరుపతి గంగమ్మను దర్శించుకున్నారు. ఆ తరువాతే తిరుమల శ్రీవారిని దర్శించుకునే సంప్రదాయానికి పునఃప్రారంభించారు. ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి అమ్మవారిని దర్శించుకున్న దాఖలాలు లేవు.

అది పల్లవుల కాలంనాటిదే

గంగమ్మ ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా చేపట్టిన తవ్వకాల్లో ప్రాచీన రాతి శిల్పాలు బయటపడ్డాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూమన ఢిల్లీలోని పురావస్తుశాఖ వారిని పిలిపించారు. బయటపడ్డ కట్టడాలు, రాతి స్తంభాలను పరిశీలించిన నిపుణులు పల్లవ రాజుల చివరి దశలోని నిర్మాణాలని వెల్లడించారు.

రూ.16 కోట్లతో ఆలయ పునఃనిర్మాణం

గంగమ్మ ఆలయ నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవతో రూ.16 కోట్ల దేవదాయశాఖ, టీటీడీ నిధులతో ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. వచ్చే నెలలో ప్రారంభం కానున్న జాతర చాటింపులోపు నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. ఈ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలని ఎమ్మెల్యే భూమన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభ్యర్థించగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గంగమ్మ ప్రాచీన వైభవ వ్యాప్తికి కృషి



"తిరుపతి గంగమ్మ ఆలయ విశిష్టతను విశ్వవ్యాప్తి చేయాలనే సంకల్పంతో అడుగులు వేస్తున్నా. ప్రజాప్రతినిధిగా తిరుపతి గ్రామదేవత ప్రాశస్త్యిపై ప్రత్యే దృష్టి సారించా. 2008లో టీటీడీ సహకారంతో అమ్మవారికి వజ్రకిరీటం చేయించా. తిరుపతి గంగమ్మకు సారె సంప్రదాయంలో స్థానిక సంస్థలు, అధికారులను సైతం భాగస్వాములను చేశా. గంగమ్మ దర్శనం తర్వాత శ్రీవారి దర్శనం ఆచారాన్ని కొనసాగేవిధంగా కృషి చేస్తున్నా.

– భూమన కరుణాకర రెడ్డి, ఎమ్మెల్యే, తిరుపతి

వినోద.. విజ్ఞాన సమ్మేళనం



నిఖిత గాంధీ గీతాలాపన



ఈల వేసి.. గోల చేసి!



తిరుత్సవ సంబరాల్లో విద్యార్థుల సందడి

- మిన్నంటిన ఐఐటీ తిరుత్సవ–2023
- ఉర్రూతలూగించిన ఇండియన్ ప్లేబ్యాక్ సింగర్ నిఖిత గాంధీ గీతాలాపన
- నేటితో ముగియనున్న టెక్నో కల్చరల్ ఫెస్ట్

రేణిగుంట, ఏర్పేడు: తిరుపతి ఐఐటీలో తిరుత్సవ సాంకేతిక సంబరాలు మిన్నంటాయి. రెండో రోజు శనివారం ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ పర్యవేక్షణలో విద్యార్థులు తిరుత్సవ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఐఐటీ క్యాంపస్‌కు చేరుకుని ఈవెంట్లను ప్రత్యక్షంగా వీక్షించి సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. సెల్ఫీలు తీసుకుంటూ కేరింతలు కొట్టారు. పలు ఈవెంట్లలో పాల్గొని తమ సామర్థ్యాలను పరీక్షించుకున్నారు. కల్చరల్, డ్యాన్స్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

హుషారెత్తించిన నిఖిత గాంధీ గీతాలాపన

ప్రఖ్యాత ఇండియన్ ప్లేబ్యాక్ సింగర్ నిఖిత గాంధీ బృందం శనివారం రాత్రి ప్రదర్శించిన గీతాలాపన హుషారెత్తించే రీతిలో ఉత్సాహంగా సాగింది. ఆమె పాడిన బాలీవుడ్ సినీ గీతాలాపన వీక్షకులను ఉర్రూతలూగించింది. విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. చప్పట్లుకొడుతూ గొంతు కలిపారు. వేదిక ప్రాంగణమంతా విద్యుత్ వెలుగుల జిలుగులు, మ్యూజికల్ శబ్దాలు ఆకట్టుకున్నాయి.

తిరుత్సవ–2023లో నేడు

తిరుత్సవ–2023 సంబరాల్లో చివరి రోజు ఆదివారం ఏస్ ఆఫ్ బార్డర్ ల్యాండ్ ఫైనల్స్, కేబీసీ షో, సరికొత్త ఆవిష్కరణల ఈవెంట్ ఐడియాథాన్, జనరల్ క్విజ్, స్పిన్ ఏ యార్న్, కేటీఎం బైక్ షో, రాత్రి డాక్టర్ కన్ఫన్ మెంటర్ షో, తిరుత్సవ్ ముగింపు సమావేశం, రాత్రి 8 గంటలకు ప్రముఖ పాప్ సింగర్ నైనా సూర్తె బృందం డీజే నైట్‌తో ఉత్సవాలు ముగుస్తాయి.



దీజే డ్యాన్స్‌ల్లో విద్యార్థుల సందడి



ఇన్‌స్టాగ్రామ్‌లో నేను!



బైక్ షో

సిలికా లీజు సమస్య పరిష్కరిస్తా

చిల్లకూరు: సిలికా లీజు పొందిన వారికి, గ్రామస్తులకు మధ్య ఏర్పడిన వివాదాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. మండలంలోని తీర ప్రాంత గ్రామమైన బల్లవోలులో సిలికా లీజుదారులకు, గ్రామస్తులకు మధ్య వివాదం నెలకొంది. ఆ భూములు సాగుచేసే పేదలు ఎమ్మెల్యేను కలిసి సమస్యను తెలియజేశారు. గ్రామస్తులు, ఇటు లీజులదారుల మధ్య నెలకొన్న వివాదాన్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ నలభై ఏళ్లుగా పేదలు సాగుచేసుకుంటున్న 30 ఎకరాలకు ఇటీవల సిలికా తవ్వకాలకు సంబంధించి మైనింగ్ లీజుల అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వివాదాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు.



లీజుదారులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మహిళలకు జగనన్న అండ

రాష్ట్రంలోని దళిత మహిళలకు సీఎం జగనన్న అండగా నిలుస్తున్నారని దిశ ఫౌండేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ నిడిగుంట అరుణ తెలిపారు. మండలంలోని బల్లవోలు గ్రామంలో సిలికా లీజుదారులు దౌర్జన్యం చేసినట్లు ఫిర్యాదు అందడంతో ఆమె క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టేందుకు బల్లవోలుకు విచ్చేశారు. పేదలు సాగుచేసుకునే భూములను పరిశీలించారు.

మొబైల్ హంట్‌తో సత్ఫలితాలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు



బాధితురాలికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ

తిరుపతి క్రైమ్: మొబైల్ హంట్ జిల్లాలో సత్ఫలితాలు ఇస్తున్నట్టు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మొబైల్ హంట్ ద్వారా రూ.45 లక్షల విలువ చేసే 250 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. గతంలో కూడా ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. మొబైల్ హంట్ ద్వారా 9490617873 నంబర్‌కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి ఛేదిస్తున్నట్టు వెల్లడించారు. సెల్ ఫోన్ పోగొట్టుకున్న వారు 9490617873 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

స్పీడో గన్స్ వితరణ

ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగించే 25 లక్షల రూపాయల విలువచేసే స్పీడో గన్స్‌ను (సమాజ సామాజిక బాధ్యత) సీఎస్ఆర్‌లో భాగంగా ద చీఫ్ ఆఫ్ ఆపరేషన్, మెయింటెన్స్, టోల్ వే వారు ఎస్పీకి వితరణ చేశారు. దీనిని ప్రధాన రహదారులు, హైవేల పై ఉంచి ఉపయోగించనున్నట్టు ఎస్పీ తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.7 లక్షల విరాళం


నగదును ప్రధాన అర్చకునికి అందిస్తున్న దాతలు

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనర సింహస్వామి నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన లక్కాకుల రామకృష్ణయ్య సతీమణి శ్యామల రూ.5 లక్షలు, కావలికి చెందిన పసుపులేటి రామయ్య మనవళ్లు హరిబాబు, రమేష్, పురుషోత్తం రూ.2 లక్షలు అందించినట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక దర్శనం చేయించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

చిల్లకూరు: కులం పేరుతో దూషించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ చేపట్టారు. నాంచారమ్మపేటకు చెందిన శనగా మధుసూదన్ ఇటీవల ఎంపీడీఓ విష్ణు చిరంజీవిని కులం పేరుతో దూషించారు.

కారు ఢీకొని నవదంపతులకు తీవ్ర గాయాలు

- ఇద్దరూ నాగలాపురం మండలంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు




తీవ్రంగా గాయపడ్డ సాయికుమార్, చికిత్సపొందుతున్న సాంభవి, ప్రమాదానికి కారణమైన కారు

పిచ్చాటూరు: కారు అదుపుతప్పి స్కూటర్‌ను ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు తీవ్రగాయాలైన ఘటన నాగలాపురం బైపాస్, భారత్ గ్యాస్ గోదాము వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం సాంభవి(26), సాయికుమార్(28)భార్యాభర్తలిద్దరూ నాగలాపురం మండలంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్నారు. భార్య బైటకొడియంబేడు సచివాలయంలో, భర్త నందనం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లుగా ఉన్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 9.30 గంటలకు నారాయణవనం నుంచి ఇద్దరూ బైక్‌పై కార్యాలయానికి వస్తున్నారు. నాగలాపురం భారత్‌గ్యాస్ గోదాము వద్ద ఎదురుగా వస్తున్న ఇన్నోవా కారు టైరు హఠాత్తుగా పేలిపోవడంతో అదుపుతప్పి స్కూటర్‌ను ఢీకొంది. స్కూటర్‌పై ఉన్న సాంభవి, సాయికుమార్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్‌కు కాలు తొలగించాల్సి ఉంటుందని వైద్యులు తెలిపినట్లు సమాచారం.

పెళ్లై నెల తిరగక ముందే..

తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట గ్రామానికి చెందిన సాయికుమార్, నారాయణవనంకు చెందిన సాంభవి పెద్దల సమక్షంలో గత మార్చి 3న ప్రేమ వివాహం చేసుకున్నారు. నెల రోజులు గడవకముందే ప్రమాద రూపంలో ఆస్పత్రి పాలవ్వడం చర్చనీయాంశమైంది.

ముగిసిన సాఫ్ట్‌బాల్ శిక్షణ


జేఎన్‌టీయూ సాఫ్ట్‌బాల్ క్రీడా జట్టుతో డీన్ రాజయ్య, ప్రిన్సిపల్స్

గూడూరు రూరల్: స్థానిక ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో వారం రోజులుగా సాగుతున్న సాఫ్ట్‌బాల్ క్రీడా జట్టు శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. పంజాబ్‌లో ఈనెల 5వ తేదీన జరగనున్న జాతీయ అంతర విశ్వ విద్యాలయాల సాఫ్ట్ బాల్ క్రీడా పోటీల కోసం జేఎన్‌టీయూ అనంతపురం క్రీడా జట్టు ఈ శిక్షణ తరగతులు నిర్వహించింది. పీడీ జి.రవిచంద్ర ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని వివిధ కళాశాలలకు చెందిన క్రీడాకారులను ఈ పోటీలకు ఎంపిక చేశారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని డీన్ ఎం.రాజయ్య కోరారు. ప్రిన్సిపల్స్ టీ.వేణుమాధవ్, కే.ధనుంజయ, ఏఓజే.రామయ్య, ఐ.ప్రసాద్, జీ.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థిని పట్ల ఆర్టీసీ డ్రైవర్ అసభ్య ప్రవర్తన

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత
- పోక్సో చట్టం కింద నమోదు కేసు

బుచ్చినాయుడుకండ్రిగ : ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆర్టీసీ డ్రైవర్‌కు బాలిక తల్లిదండ్రులు, బంధువులు దేహశుద్ధి చేసి పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. పోక్సో యాక్ట్ కింద అతనిపై కేసు నమోదైంది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని చల్లమాంబపురం గ్రామంలోని తమిళ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. గ్రామం నుంచి శ్రీకాళహస్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో చల్లమాంబపురంలోని హైస్కూల్‌కు వెళ్లేది. ఇదే డిపోకు చెందిన డ్రైవర్ శ్రీనివాసులు (45) విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు డ్రైవర్‌కు దేహశుద్ధి చేసి, స్థానిక పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.